సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



రాజన్న సేవలో ఎన్నికల వ్యయపరిశీలకులు

వేములవాడ: రాజన్నను కరీంనగర్ నియోజకవర్గ ఎన్నికల వ్యయపరిశీలకులు అశ్వినిపాండే శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. రాజన్నను 15 వేల మంది భక్తులు దర్శించుకోగా.. రూ.18లక్షల ఆదాయం సమకూరింది.



న్యూస్‌రీల్

లారీల కొరత లేకుండా చూడాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న విప్

చందుర్తి(వేములవాడ): కొనుగోలు కేంద్రాల్లో లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా అధికారులకు సూచించారు. చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ ఈ విషయమై విన్నవించగా.. వెంటనే జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జిల్లా కార్యదర్శి గొట్టె ప్రభాకర్, నాయకులు భీంరాజు కనకరాజు, దారం చంద్రం, వేల్పుల దేవస్వామి, పులి సత్తయ్య, ధర్మపురి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాధ్యతగా ఓటుహక్కు వినియోగించుకుందాం

● జెడ్పీ సీఈవో ఉమారాణి



సిరిసిల్లలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

సిరిసిల్ల: ఓటుహక్కు వినియోగం ప్రతీ ఒక్కరి బాధ్యత అని, పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని జెడ్పీ సీఈవో ఉమారాణి కోరారు. జిల్లా సమాఖ్యలో శుక్రవారం నిర్వహించిన మహిళల సమావేశంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఓటరు ఎన్నికల్లో ఓటువేసేలా మహిళలు చైతన్యపరచాలన్నారు. ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేలా చూడాలన్నారు. స్వీప్‌లో భాగంగా జిల్లా సమాఖ్య ప్రతినిధులు 'ఐ ఓటు ఫర్ ష్యూర్' 'ఓటుహక్కు నా బాధ్యత' అంటూ నినాదాలు చేసి ప్రతిజ్ఞ చేశారు. డీఆర్డీవో శేషాద్రి, స్వీప్ నోడల్ అధికారి, అడిషనల్ డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, డీపీఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్



వెదర్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌ను అర్థ గణాంకశాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షపాతం వివరాలు ఎలా నమోదవుతున్నాయో సందర్శించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 21 ఆటోమేటిక్ వెదర్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. ఎప్పటికప్పుడు వాతావరణం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వివరించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బోనాలలో వరి పంటకోత ప్రయోగం నిర్వహించారు. డీవైఎస్‌వోలు శ్యాంసుందర్, గణేశ్, సీపీవో శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● డీటీవో లక్ష్మణ్



వాహన తనిఖీలు చేస్తున్న డీటీవో లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డుపై తిరిగే ప్రతీ వాహనదారుడు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేకపోవడంతో పలు వాహనాలను సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సుమారు 30 వాహనాల యజమానుల జరిమానాలు విధించారు. డీటీవో లక్ష్మణ్ మాట్లాడుతూ అతివేగంగా వాహనాలు నడిపితే డ్రైవింగ్‌లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలుకెళ్లడం ఖాయమన్నారు.

ఆహ్లాదం అధ్వానం



మీరు చూస్తున్న ఈ చిత్రం సిరిసిల్ల ఇందిరాపార్కులోనివి. రూ.50లక్షలు పైబడి వెచ్చించిన ఈపార్కు అందాలు నిత్యం వందలాది మందికి కనువిందు చేసేవి. ఫొటో, వీడియో షూటింగ్స్‌కు అనుకూలంగా ఉండే ఈ పార్కు నిర్వహణ లోపంతో ఇలా డస్ట్‌బిన్స్ విరిగిపోయి, చెత్తకుప్పలతో, పచ్చదనం కనుమరుగైతుంది.



పూర్తిగా పాడుబడిన తోటలాగా కనిపిస్తున్న ఈ ఫొటో శివనగర్ పార్కులోనివి. కార్మికవాడల్లోని ఈపార్కులో వర్కర్లు లేక, మున్సిపల్ పట్టింపు లేకుండా ఇలా మొక్కలు పాడై, చెట్లు విరుగుతూ.. పాత్ వేస్ పాడయి ఎండిపోయిన మొక్కలతో సందర్శకులకు దర్శనమిస్తుంది. ఇక్కడ పనిచేసే వారు లేక పార్కులో తాగుబోతులకు అడ్డాగా మారింది. స్మార్ట్‌సిటీ లుక్‌తో ఏర్పాటైన పార్కు ఇప్పుడు వట్టిపోతుంది.



మీరు చూస్తున్న ఈ ఫొటో వెంకట్రావునగర్ పార్కులోనిది. స్మార్ట్ సిటీలో భాగంగా ఏడేళ్లక్రితం ఈపార్కును రూ.60లక్షలతో నిర్మించారు. అప్పట్లో ఎంతో ఆహ్లాదాన్ని పంచిన ఈ పార్కు పచ్చదనం కోల్పోయి, ఆటవస్తువులు విరిగిపోయి, పెద్దలు, చిన్న పిల్లలకు పనికిరాకుండా ఉంటుంది. ఓపెన్‌జిమ్ పరికరాలు విరిగిపోయి, వాటర్ ఫౌంటేయిన్ అందాలు కోల్పోయి ఇలా కళావిహీనంగా మారింది.



మీరు చూస్తున్న ఈ ఫొటో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్ పార్కు. అప్పట్లోనే రూ.30లక్షలతో నిర్మించిన ఈపార్కులో అందమైన గోబిగోలు, మోడ్రన్ టాయిలెట్స్, వాటర్ ఫౌంటేయిన్స్, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయగా..పార్కు నిర్వహణ కరువైంది. ఫలితంగా పార్కులో జిమ్ పరికరాలు విరిగి, ఫౌంటేయిన్స్ పాడయి, మోడ్రన్ టాయిలెట్స్ గోడలు పగుళ్ల బారి పోయింది. కంటికి ఇంపైన పచ్చదనంతో ఆహ్లాదం పంచిన అందాలు ఇలా ప్రజలకు బోసిపోయి శోభాహీనంగా కనిపిస్తున్నాయి.

- కనుమరుగైన పచ్చదనం
- సిరిసిల్ల వాసుల ఆగ్రహం
- నిరుపయోగంగా ప్రజా ఆస్తులు
- బోసిపోతున్న పార్కులు
- విరిగిన ఆట వస్తువులు



సిరిసిల్ల ఇందిరాపార్కులో ఎండిపోతున్న గడ్డి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు స్మార్ట్‌సిటీ స్ఫూర్తితో సిరిసిల్లలో నిర్మించిన పార్కులు నిర్వహణ లేక బోసిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు, సందర్శకులకు ఆహ్లాదం పంచేందుకు కార్పొరేట్ స్థాయిలో పార్కులు, జంక్షన్లు, డివైడర్లను సుందరీకరించారు. వాటి నిర్వహణను కొన్నేళ్లుగా మహిళా సమాఖ్యలకు కాంట్రాక్టు అప్పగించారు. కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలో పార్కులు కళావిహీనంగా మారాయి. ఇప్పుడు మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహణ సాగుతుండగా.. వర్కర్ల కొరత, నిధుల లేమితో పార్కులు పనికిరాకుండా పోయాయి. ఫలితంగా పట్టణ వాసులు, చిన్నారులు, పెద్దలు వేసవిలో ఆహ్లాదం కోసం వస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో కళావిహీనంగా మారిన

స్మార్ట్ అందాలపై ఫోకస్..

ప్రజాధనం వృథా

సిరిసిల్ల పట్టణంలో గత ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ చొరవతో రూ.5.46 కోట్లతో పది పార్కులు, రూ.2.15 కోట్లతో ఆరు ప్రధాన కూడళ్లు, సుమారు రూ.10 కోట్లతో పట్టణం నుంచి ఇతర నగరాలకు వెళ్లే ప్రధాన రహదారుల విస్తరణతోపాటు డివైడర్లు, వాటి మధ్యలో గ్రీనరీ ఏర్పాటు చేశారు. ఇతర పట్టణాలకు ఆదర్శంగా నిలిచేందుకు రూ.కోట్లు వెచ్చించగా.. నిర్వహణ లోపం, పాలకులు, అధికారుల అలక్ష్యం ప్రజలకు ఆహ్లాదాన్ని దూరం చేస్తుంది. మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రతిరోజు పార్కులు, జంక్షన్లు, డివైడర్ల మధ్యలో గ్రీనరీ పెంచుతూ మొక్కలు, గడ్డి పాడవకుండా చూడాలి. ఏపుగా పెరిగిన చెట్లు, మొక్కలు, గడ్డిని నిత్యం కత్తిరించాలి. వాటిని నిర్దేశిత ప్రాంతాల్లో వేయాలి. మొక్కలకు ఎరువు పెట్టడం, పాడయిన జిమ్ పరికరాలు, పాత్‌వేస్, ఫౌంటేన్స్ తదితరాలు రిపేరు చేయించాలి. కానీ మున్సిపల్ నిర్వహణ లోపంతో పార్కుల అందాలు కనుమరుగవుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పార్కుల వివరాలు ఇలా..

వెంకట్రావునగర్	రూ.60లక్షలు
నెహ్రూపార్కు	రూ.90లక్షలు
శివనగర్ పార్కు	రూ.40లక్షలు
అంబికానగర పార్కు	రూ.50లక్షలు
ఇందిరాపార్కు	రూ.80లక్షలు
గణేష్‌నగర్ పార్కు	రూ.50లక్షలు
టీ.ఆర్.నగర్ పార్కు	రూ.13లక్షలు
పద్మనగర్ పార్కు	రూ.15లక్షలు
యాదాద్రి డెన్స్ పార్కు	రూ.10లక్షలు
అర్బన్ ఫారెస్టు పార్కు	రూ.1.38లక్షలు

వర్కర్లను సర్దుబాటు చేస్తున్నాం



హరిత సిరిసిల్ల లక్ష్యాన్ని పాడుకానివ్వం. ప్రణాళికాబద్ధంగా మున్సిపల్ వర్కర్లతో పార్కులు, డివైడర్లు, జంక్షన్లలోని మొక్కలకు నీరు పోయిస్తున్నాం. పట్టణంలో గ్రీనరీ పనుల కోసం వర్కర్ల కొరతను సరిదిద్దుతున్నాం. ప్రత్యేక ప్రణాళికతో పార్కుల నిర్వహణ సాగిస్తూ అవసరమై చోట్ల అభివృద్ధి పనులు చేపడతాం.

– డి.లావణ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ చేయండి

- బీఆర్ఎస్ అభ్యర్థులే ఆ పార్టీని వీడుతున్నారు
- రాష్ట్ర విభజన హామీలేవీ బీజేపీ నెరవేర్చలేదు
- ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారు
- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే సత్యం, మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: అధికారం నుంచి ప్రజలు తిరస్కరించినా కేసీఆర్, కేటీఆర్‌లకు అహం పోలేదని, తమ ప్రభుత్వాన్ని కూల్చుతామంటుండ్రని.. దమ్ముంటే కాంగ్రెస్‌ను టచ్ చేయండని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. సిరిసిల్లలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థులుగా నిలబెట్టిన వారే ఆ పార్టీ అవినీతి, నియంతృత్వంపై ఛీత్కరించుకుంటూ పార్టీని వీడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజాపాలన అందించే కాంగ్రెస్‌పైనే ప్రజల ఆశీర్వాదం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలేవీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నెరవేర్చలేదన్నారు. ప్రజాస్వామ్య విలువలు తెలువనోళ్లు రాజకీయం చేస్తే.. ఇట్లానే ఉంటుందని బీఆర్ఎస్, బీజేపీలను ఉద్దేశించి విమర్శించారు. ఆ పార్టీల నియంతృత్వంపై ప్రజలు విసిగిపోయారని, రాహుల్ నేతృత్వంలో అందించే ప్రజాపాలనకే రానున్న ఎన్నికల్లో ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటై సిరిసిల్లకు కేటాయించిన మెగా టెక్స్‌టైల్ క్లస్టర్‌ను వరంగల్‌కు తరలించి ఇక్కడి కార్మికుల ఉసురు పోసుకున్నారని ధ్వజమెత్తారు. కరీంనగర్ నుంచి పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు.

రూ.60కోట్ల అప్పు రూ.7లక్షలకు పెరిగింది

అరవై ఏళ్లలో రూ.60కోట్లు అప్పులున్న తెలంగాణను పదేళ్లలో రూ.7లక్షల కోట్ల అప్పుల్లోకి కేసీఆర్ కుటుంబం నెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడవక ముందే కూలుతుందని శాపనార్థాలు పెడుతున్న కేసీఆర్ కుటుంబ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నాలుగు నెలల్లోనే అమలు చేశామని, రాహుల్‌గాంధీ ప్రకటించిన ఈ ఎన్నికల హామీలు సైతం అమలు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు రాష్ట్ర విభజన హామీలు అమలు చేయలేదని ఎద్దేవా చేశారు.

అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితో: ఆది శ్రీనివాస్

గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు స్ఫూర్తితో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిద్దామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో బీఆర్ఎస్ నియంతృత్వ పాలనను ప్రజలు పడగొట్టారని, ఇప్పుడు కేంద్రంలో నియంతృత్వాన్ని కూల్చడానికి సిద్ధమయ్యారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీలో కలిసేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ...బండి సంజయ్ చదువు రాని మొద్దని, ఆయనను గెలిపించుకున్నందుకే ఏమి అభివృద్ధి చేయలేదన్నారు. కేటీఆర్ పనైపోయిందని అమెరికాకు వెళ్లాలో..జైలుకు వెళ్లాలో తేల్చుకునే సమయం ఆసన్నమైందని చురక అంటించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అబద్ధాలు, మోసాలతో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌లు పాలన సాగించి ప్రజలను ఇబ్బందులు పెట్టారన్నారు. సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పాలన పోలీస్ నిర్బంధంలో సాగిందని ఇప్పుడు ప్రజాపాలనే నడుస్తుందన్నారు. నేరెళ్లలో దళితులపై పోలీస్‌లతో బీఆర్ఎస్ చేపట్టిన దాష్టీకాన్ని ప్రజలు మరువొద్దన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్ల డబ్బులు నేతన్నలకు ఇవ్వకుండా ఎందుకు బకాయి పెట్టావ్ కేటీఆర్ అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, సత్యనారాయణ, నాయకులు పెరుమాండ్ల శ్రీనివాస్, ప్రణవ్, నాగుల సత్యనారాయణ గౌడ్, సంగీతం శ్రీనివాస్, చీటి ఉమేశ్‌రావు, ఆకునూరి బాలరాజు, చొప్పదండి ప్రకాశ్, కనమేని చక్రధర్‌రెడ్డి, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, సూర దేవరాజు, పిట్టల భూమేశ్, కౌన్సిలర్లు రెడ్యానాయక్, కుడిక్యాల రవికుమార్, వేముల రవికుమార్, గోనె ఎల్లప్ప, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, వెల్మల స్వరూప, కల్లూరి చందన, మడుపు శ్రీదేవి, గొట్టె రుక్మిణి పాల్గొన్నారు.

దమ్ముంటే ఎంపీగా పోటీ చెయ్..

- మంత్రి పదవికి రాజీనామా చేసిరా.. ఎవరికి ప్రజాదరణ ఉందో తేల్చుకుందాం
- బండి సంజయ్ తరఫున నామినేషన్ దాఖలు చేసిన బీజేపీ నేతలు



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్: గత కొద్ది రోజులుగా బీజేపీ, బండి సంజయ్‌పైన మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ నాయకత్వం తీవ్రంగా స్పందించింది. ఇకనైనా పిచ్చివాగుడు మానుకోవాలని హెచ్చరించింది. పొన్నంకు దమ్ముంటే నేరుగా పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాలని సవాల్ విసిరింది. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బండి సంజయ్ కుమార్ తరఫున పార్టీ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ డి.శంకర్, కార్పొరేటర్ రమణారెడ్డి తదితరులు శుక్రవారం మధ్యాహ్నం కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాననే విషయాన్ని పొన్నం మరిచిపోయారని అన్నారు. చివరకు న్యాయస్థానాలపై కూడా ఆరోపణలు చేస్తూ లిక్కర్‌స్కాం నిందితుడు శరత్ చంద్రారెడ్డి బీజేపీకి రూ.500 కోట్ల ఎలక్ట్రోబాండ్స్ ఇవ్వగానే... కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చిందని వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. శరత్ చంద్రారెడ్డికి బెయిల్ ఇచ్చింది గౌరవ సుప్రీంకోర్టు అని, బెయిల్‌కు, బాండ్స్‌కు సంబంధం ఏంటని ప్రశ్నించారు. వెంటనే సుప్రీంకోర్టు పొన్నం వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని నోటీసులు జారీ చేయాలని కోరారు. ఏ సర్వే చూసినా బండి సంజయ్ బంపర్ మెజారిటీతో గెలవబోతున్నడని తేలడంతో పొన్నంకు ఫ్రస్టేషన్ ఎక్కువైందని, అందుకే కరీంనగర్ నుంచి అభ్యర్థి ఎవరో కూడా తేల్చలేకపోతున్నరని విమర్శించారు. ఘోరంగా కాంగ్రెస్ ఓడిపోతే మంత్రి పదవికే ఎసరొస్తుందనే భయం పొన్నంకు పట్టుకుందన్నారు. మంత్రిని అని మరిచిపోయి పొన్నం అడ్డగోలుగా ఆరోపణలు చేస్తూ సభ్యసమాజం అసహ్యించుకునేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పొన్నం ప్రభాకర్ ఇకనైనా బండి సంజయ్‌పై అవాకులు చవాకులు మానుకోవాలని హితవు పలికారు.

ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తరలింపు



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

● పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో మొదటి ర్యాండమైజేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. సర్దాపూర్ గోదాంలోని ఈవీఎంలను శుక్రవారం కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ నుంచి సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తరలింపు ప్రక్రియను పరిశీలించారు. పోలీసుల భద్రత మధ్య స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. సిరిసిల్ల నియోజకవర్గానికి కంట్రోల్ యూనిట్స్ 358, బ్యాలెట్ యూనిట్స్ 358, వీవీ ప్యాట్లు 401, వేములవాడ నియోజకవర్గానికి కంట్రోల్ యూనిట్స్ 325, బ్యాలెట్ యూనిట్స్ 325, వీవీ ప్యాట్లు 364 కేటాయించారు. అదనపు కలెక్టర్‌లు పూజారి గౌతమి, ఎన్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, వివిధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): ప్రభుత్వ దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. సముద్రలింగాపూర్, ముచ్చర్లలోని ఆరోగ్య ఉపకేంద్రాలను తనిఖీ చేశారు. సముద్రలింగాపూర్‌లో ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, పీవో ఉమాదేవి, మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు శివాని, వనజ పాల్గొన్నారు.

'బండి' పోరాటంతోనే స్పందించిన ప్రభుత్వం

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ

సిరిసిల్ల: నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై ఎంపీ బండి సంజయ్ చేపట్టిన పోరాట ఫలితంగానే రూ.50కోట్లు విడుదలయ్యాయని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ పేర్కొన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్‌లతో కలిసి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. నేతన్నల దీనావస్థపై బండి చేపట్టిన పోరాటంతోనే రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చిందని పేర్కొన్నారు. మిగిలిన రూ.301 కోట్లు కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పని ప్రాంతంలో వసతి కల్పించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఉపాధిహామీ పనులు జరిగే ప్రాంతాల్లో వసతి కల్పించాలని డీఆర్డీవో శేషాద్రి సూచించారు. తంగళ్లపల్లి మండలంలోని ఉపాధిహామీ సిబ్బందితో మండల పరిషత్‌లో శుక్రవారం సమావేశమయ్యారు. డీఆర్డీవో శేషాద్రి మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి జాబ్‌కార్డు గల ప్రతీ కుటుంబానికి పని కల్పించాలని సూచించారు. 8,815 జాబ్‌కార్డులకు 8,81,500 పని దినాలు కల్పించాలన్నారు. జిల్లాలో మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని కోరారు. ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో(ఎఫ్ఏసీ) జోగం రాజు, ఇన్‌చార్జి ఏపీవో రాజనర్సయ్య పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు
- అక్రమార్కులను పట్టుకునేందుకు టాస్క్‌ఫోర్స్ నిఘా

సిరిసిల్లక్రైం: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో నేరవిచారణ సమర్థంగా చేపట్టాలని సూచించారు. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టి పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిస్సింగ్‌కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతీ రోజు వాహనాల తనిఖీలు చేపట్టాలని, గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ సీసీ కెమెరాల ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, మహిళా చట్టాలు, గంజాయితో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయితీలు చేస్తామంటూ మధ్యవర్తిత్వం చేసే వ్యక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిత్యం చేపట్టాలని సూచించారు.

పటిష్ట ప్రణాళికతో పార్లమెంట్ ఎన్నికలు

ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగేలా అందరూ కలిసి పనిచేయాలని ఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచి, బైండోవర్ చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజలకు భద్రత భావం కల్గించాలని పేర్కొన్నారు. ట్రెయినీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, మురళీకృష్ణ, సర్వర్, సీఐలు, ఎస్సైలు, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీబీవీల్లో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ల తనిఖీ



కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ రాష్ట్ర డైరెక్టర్లు

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్లలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంతోపాటు తంగళ్లపల్లి పాఠశాలలను సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య భట్టు, ఏఎస్‌పీడీ రమేశ్, జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, స్టేట్ సీఎంవో జోసెఫ్ శుక్రవారం తనిఖీ చేశారు. భోజన మెనూ, వసతుల పరిశీలన, యూనిఫామ్‌ల గురించి విద్యార్థులతో మాట్లాడారు. కేజీబీవీ సిరిసిల్ల పాఠశాలకు మంజూరైన అడిషనల్ అకాడమిక్ బ్లాక్ పనులు పర్యవేక్షించారు. డీఈవో రమేశ్‌కుమార్, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ పద్మజ, ఈఈ అనిత, ఏఈ అశోక్‌రావు, పాఠశాల ప్రత్యేకాధికారి పావని పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఉత్సవాల్లో పాల్గొన్న టెస్కాబ్ చైర్మన్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం లింగన్నపేటలో సమిష్టి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీనల్లపోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేవతారాధన, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు.

దంత సంరక్షణతో ఆరోగ్యం



తెర్లుమద్దిలో దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముస్తాబాద్(సిరిసిల్ల): దంత సంరక్షణతో ఆరోగ్యం కాపాడుకోవాలని దంత వైద్యుడు విజయ్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని పలువురికి దంత పరీక్షలు చేశారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 12 రకాల వైద్యపరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారి గీతాంజలి, ఎంఎల్‌హెచ్‌పీ శశాంక్, మెంగని లింగం, హెచ్ఈవో యాదగిరి, ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశవర్కర్లు జ్యోతి, రేణుక ఉన్నారు.

పంచాయతీ పన్నుల పక్కదారిపై విచారణ

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో ఇంటి పన్ను, ఇతర పన్నులు పక్కదారి పట్టిన వైనంపై విచారణ చేపడతామని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య తెలిపారు. ఇంటి పన్నుల రశీదు విషయంలో ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో అసలు రశీదులో ఒక విధంగా, కార్బన్ డూప్లికేట్ రశీదులో మరో విధంగా ఉండడంపై విచారణ చేస్తామన్నారు. అసలు రశీదులు, కార్బన్ డూప్లికేట్ రశీదుల వ్యవహారంలో ఎంతటి వారున్నా ఉపేక్షించబోమని డీపీవో స్పష్టం చేశారు.

చివరికి అందని మా'నీరు'



ఆక్విడేటర్ డ్యామేజీతో కిందికి వస్తున్న నీరు



ఆక్విడేటర్ల లీకేజీతో చెరువును తలపిస్తున్న ప్రాంతం

- ఆక్విడేటర్ల లీకేజీలు.. అన్నదాతలకు తిప్పలు
- మంజూరుకు నోచుకోని ప్రతిపాదనలు
- వృథాగా పోతున్న ఎగువమానేరు నీరు

ముస్తాబాద్(సిరిసిల్ల): అధికారుల నిర్లక్ష్యం.. పాలకుల పట్టింపులేమి.. అన్నదాతలకు శాపంగా మారింది. అసలే ఎండాకాలం.. ఆపై లీకేజీలతో ఎగువమానేరు నీరు ఆయకట్టు చివరి భూములకు అందేలా లేవు. ఫలితంగా పంటలు ఎండిపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ముస్తాబాద్ మండల కేంద్రం శివారులోని ఆక్విడేటర్ల లీకేజీతో సిద్దిపేటకు వెళ్లే రోడ్డు పక్కన ఓ చెరువులా మారింది.

75 ఏళ్ల నాటి ఆక్విడేటర్లు

నిజాం చివరి రాజు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ సర్మాల వద్ద కూడవెళ్లి, పాల్వంచవాగులపై 1945లో ఎగువ మానేరు ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లలో పూర్తి చేసుకున్న ఈ ప్రాజెక్టు ద్వారా కుడికాలువ నుంచి ముస్తాబాద్ మండలంలోని 10వేల ఎకరాలకు సాగునీరందుతుంది. ఇందుకోసం 42 కిలోమీటర్ల కెనాల్‌ను ఆ రోజుల్లోనే తవ్వించారు. కొండలు, ఎత్తయిన ప్రదేశాల్లో నీరు సాఫీగా వెళ్లేందుకు ఆక్విడేటర్లను నిర్మించారు. గోపాల్‌పల్లె, గూడూరు, ముస్తాబాద్, తెర్లుమద్ది శివారుల్లో ఐదు ఆక్విడేటర్లను అప్పుడే నిర్మించారు. ఆక్విడేటర్లు కుడికాలువ ద్వారా 12 గ్రామాలకు సాగునీటిని అందిస్తుంది. కాలక్రమేన ఆక్విడేటర్ల పర్యవేక్షణ లోపించడంతో మొక్కలు పెరిగి ధ్వంసమయ్యాయి. ముస్తాబాద్ శివారులోని తెర్లుమద్ది పంటపొలాలకు సాగునీరు వెళ్లే రెండు ఆక్విడేటర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ లీకేజీలతో నీరంతా వృథాగా కిందికి పోయి.. ఆ ప్రాంతంలో చిన్నపాటి చెరువుల మారింది.

ప్రతిపాదనలకు దక్కని నిధులు

ఆక్విడేటర్ల మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నా నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు నిధులు విడుదల చేయడం లేదని తెలిసింది. అయితే ఆరు నెలల క్రితం గోపాల్‌పల్లె వద్ద ఆక్విడే టర్ మరమ్మతుకు నిధులు విడుదల చేశారు. గూడూరు, ముస్తాబాద్, తెర్లుమద్దిలో ఉన్న ఆక్విడేటర్లకు మాత్రం నిధులు విడుదల కావడం లేదు.

10 వేల ఎకరాలు..

ముస్తాబాద్ మండలంలోని 10వేల ఎకరాలకు సాగునీరు అందించే నిజాం కాలం నాటి ఎగువమానేరు ప్రాజెక్టు ఆక్విడేటర్ల పరిస్థితి దారుణంగా ఉంది. నీటిపారుదలశాఖ అధికారులు ఏటా ప్రతిపాదనలు చేసినా నిధులు మంజూరు కావడం లేదు. ఫలితంగా రిపేర్లు చేయడం లేదు. ముస్తాబాద్ శివారులోని వెయ్యి ఎకరాలు, తెర్లుమద్దిలోని 2వేల ఎకరాలకు ఎగువమానేరు నీరు అందడం లేదు. త్రైబంధీ తీర్మానం మేరకు సాగు నీరందించాలన్న అధికారుల ఆదేశాలకు క్షేత్రస్థాయిలో పొంతన కుదరడం లేదు.

రెండు ఎకరాలు ఎండింది



ఎగువమానేరు ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిపై ఆధారపడి తెర్లుమద్దిలో వందలాది ఎకరాలు సాగుచేస్తున్నారు. ముస్తాబాద్ వద్ద ఆక్విడేటర్లు లీకేజీలై నీరంతా వృథాగా పోతోంది. ఆ నీరు వస్తే మా పంటలు ఎండేవి కావు. నీరు లేక నేను సాగు చేసిన రెండు ఎకరాలు ఎండిపోయాయి.

– ఈసరి కృష్ణ, తెర్లుమద్ది

నీటి కోసం ఉద్యమాలు చేశాం



ఎగువ మానేరు పరిరక్షణ పేరుతో ముస్తాబాద్ మండలానికి సాగునీరు అందించాలని అనేక ఉద్యమాలు చేశాం. గత ప్రభుత్వం పదేళ్లలో కనీసం ఆక్విడేటర్లను కూడా బాగు చేయలేకపోయింది. ప్రతిపాదనలకు రూపాయి విడుదల చేయలేదు.

– ఓరగంటి తిరుపతి, మాజీ సర్పంచ్, ముస్తాబాద్

ప్రతిపాదనలు పంపాం



ప్రాజెక్టు కింద ఉన్న కెనాల్స్, షట్టర్లు, డిస్ట్రిబ్యూటరీలతోపాటు ఆక్విడేటర్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదల కాలేదు. ఆక్విడేటర్ల లీకేజీలకు తాత్కాలిక మరమ్మతులు చేసినా ఉండడం లేదు. రైతుల సహకారంతో లీకేజీలను ఆపే ప్రయత్నం చేస్తాం. నిధులు రాగానే పనులు చేపడతాం.

– వంశీకృష్ణ, ఏఈ, ముస్తాబాద్

వస్త్రపరిశ్రమ బకాయిలు చెల్లిస్తాం

- వస్త్ర పరిశ్రమ జేఏసీ ప్రతినిధులతో మంత్రి పొన్నం

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ పరంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బకాయిలు చెల్లిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పష్టం చేశారు. సిరిసిల్లకు వచ్చిన ఆయనను శుక్రవారం వస్త్రపరిశ్రమ, అనుబంధ రంగాల జేఏసీ ప్రతినిధులు, వస్త్ర వ్యాపారులు వేర్వేరుగా కలిశారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని నిధులు ఇచ్చామని, గత ప్రభుత్వం కంటే ఎక్కువ పనిని సిరిసిల్ల నేతన్నలకు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆర్డర్లను 365 రోజులపాటు అందిస్తామని స్పష్టం చేశారు. గతంలోని పథకాలన్నింటిని కొనసాగిస్తామన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, జయలక్ష్మి, కూరపాటి రమేశ్‌లు మాట్లాడుతూ..కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీ అందివ్వాలని కోరారు.

స్వీట్లు పంపిణీ

ప్రభుత్వం నుంచి సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు రావాల్సిన బకాయిల్లో కొంత మొత్తం చెల్లించిన నేపథ్యంలో సిరిసిల్ల వస్త్ర వ్యాపారుల్లో హర్షం వ్యక్తమైంది. వారు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్వీట్లు తినిపించుకున్నారు. జేఏసి ప్రతినిధులు మండల సత్యం, గోలి వెంకటరమణ, మూశం రమేష్, బొద్దు శ్రీధర్ తదితరులున్నారు. విద్యార్థి నాయకుడు పోకల సాయికుమార్ మంత్రి సమక్షంలో పార్టీలో చేరగా..ఆది శ్రీనివాస్, కే.కే. మహేందర్‌రెడ్డిలు అభినందించారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లెలో శుక్రవారం పిడుగుపాటుకు పారిపెల్లి రాజిరెడ్డి అలియాస్ చిన్నరాజుకు చెందిన ఆవు చనిపోయింది. పాలిచ్చే ఆవు మృతితో రూ.80వేల నష్టం జరిగిందని రైతు రాజిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అకాల వర్షం.. రైతన్న ఆగమాగం

- ఈదురుగాలులతో కూలిన చెట్లు
- చిరుజల్లులతో తడిసిన ధాన్యం
- కవర్లు లేక ఆందోళన
- త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్



రుద్రంగిలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/వీర్నపల్లి(సిరిసిల్ల)/కోనరావుపేట/రుద్రంగి(వేములవాడ): జిల్లాలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. ఈదురుగాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి, నారాయణపూర్, సింగారం, కోరుట్లపేట, రాచర్లగుండారం, తిమ్మాపూర్ గ్రామాల్లో కురిసిన వర్షంతో ధాన్యం తడిసింది. ముస్తాబాద్ మండలంలో ఆవునూర్, గూడెం, పోతుగల్, నామాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కేంద్రాల్లో టార్పాలిన్లు లేకపోవడంతో రైతులే స్వయంగా అద్దెకు తెచ్చుకున్న కవర్లను కప్పే ప్రయత్నం చేశారు. ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఇబ్బందులు పడ్డారు. అధికారులు టార్పాలిన్లు ఇచ్చి, సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరారు. రోజుల తరబడి కేంద్రాల్లో పడిగాపులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు మద్దిమల్ల, రంగంపేట, గర్జనపల్లి, అడవిపదిర గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. రుద్రంగి మండలంలో కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసింది. తేమశాతం వచ్చినప్పటికీ సకాలంలో తూకం వేయకపోవడంతో ధాన్యం మళ్లీ తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కొట్టుకుపోయిన రేకులు

భారీగా ఈదురుగాలులు వీయడంతో వీర్నపల్లి మండల కేంద్రంలోని మినరల్ వాటర్ ప్లాంట్ రేకులషెడ్డు లేచిపోయింది. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో గౌరు లక్ష్మి ఇంటి రేకులు లేచిపోయాయి. బాధిత కుటుంబాన్ని సీపీఎం జిల్లా సభ్యురాలు జవ్వాజి విమల పరామర్శించారు.



ముస్తాబాద్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



బండలింగంపల్లిలో తడిసిన ధాన్యం

గజవాహనంపై స్వామి విహారం



గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం హోమం నిర్వహించారు. సాయంత్రం సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వామి వారికి స్వాగతం పలికారు.



ధాన్యం దళారుల పాలు



ధాన్యం తూకం వేస్తున్న దళారులు

- కొనుగోలు కేంద్రాల్లో ప్రారంభంకాని తూకం
- దళారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- క్వింటాల్‌కు రూ.2,050 మాత్రమే..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అన్నదాతల ఆరుగాలం కష్టం దళారుల పాలవుతోంది. వాతావరణంలో వస్తున్న మార్పులతో రైతులు ఆగమాగమవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం ప్రారంభించకపోవడంతో పల్లెల్లోకి వస్తున్న ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో వారం రోజులుగా రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు. ప్రభుత్వం రూ.2,203 మద్దతు ధర నిర్ణయించగా, దళారులు క్వింటాల్‌కు రూ.2,050 చొప్పున చెల్లిస్తున్నారు. అంతేకాకుండా క్వింటాల్‌కు 4 కిలోల ధాన్యం అదనంగా తూకం వేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని వేగంగా కొనుగోళ్లు చేపట్టాలని కోరుతున్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై ఎక్సైజ్ కొరడా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై ఎక్సైజ్‌శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. తంగళ్లపల్లి మండలం బస్వాపూర్, ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్, బోయినపల్లి మండలం కోరెం గ్రామాల్లో శుక్రవారం అక్రమ మద్యాన్ని సీజ్ చేశారు. బస్వాపూర్‌లో రూ.11వేలు, తిప్పాపూర్‌లో రూ.10వేల విలువైన మద్యం సీజ్ చేశామని కోరెం శివారులో 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ గులాం ముస్తాఫా తెలిపారు. దాడుల్లో ఎస్సై ప్రణీత్‌గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా

- మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్
- తాడూర్ గౌడన్నలకు భరోసా ఇచ్చిన మంత్రి



తాడూర్ గౌడన్నలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అధైర్య పడకండి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తాడూర్ గ్రామ గౌడన్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ భరోసానిచ్చారు. శుక్రవారం అగ్నిప్రమాదానికి గురైై తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామంలో సుమారు 250 తాటి, ఈత చెట్లు కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న మంత్రి కాలిపోయిన కాలిపోయిన తాటి, ఈతచెట్లను పరిశీలించారు. గీతకార్మికులు బాధపడొద్దని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ఉన్నారు.

అప్పుల బాధతో గొర్రెల కాపరి ఆత్మహత్య



మల్లయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అప్పుల బాధతో ఓ గొర్రెల కాపరి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిపేట మండలంలోని రాగట్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రమాకాంత్, గ్రామస్తుల వివరాల ప్రకారం.. రాగట్లపల్లికి చెందిన నెత్తెట్ల చిన్న మల్లయ్య(48) ఇల్లు నిర్మించుకునేందుకు, భూమిని అభివృద్ధి చేయడం కోసం సుమారు రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. వ్యవసాయం, గొర్రెల పెంపకం ద్వారా ఆదాయం అంతంత మాత్రంగానే వస్తుండటంతో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య సత్తవ్వ, కుమారుడు అజయ్, కూతురు అమ్ములు ఉన్నారు. మల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ దాసరి సుజాత, గ్రామస్తులు కోరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన రెండు ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లిన దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. ఈ నెల 10న సిరిసిల్ల పాత బస్టాండ్ ఏరియాలోని బార్ అండ్ రెస్టారెంట్ ఎదుట నిలిపిన, సినారె గ్రంథాలయం ఎదుట పార్కింగ్ చేసిన బైకులు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సిరిసిల్ల పట్టణం వెంకంపేటలో ఉండే చెందిన కోల రవిగౌడ్‌ను దొంగగా తేల్చారు. ఇతను కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పరీద్‌పేటకు చెందినవాడని, ఉపాధి నిమిత్తం సిరిసిల్లలో ఉంటున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఎత్తుకెళ్లిన వాహనాల్లో ఒకటి పొదల్లో దాచిపెట్టాడని, మరోదానిపై సిరిసిల్ల బైపాస్ రోడ్డుమీదుగా వెళ్తుంటే పట్టుకున్నామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సరెండర్!

హుజూరాబాద్: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ఆరుగురు ఉద్యోగులను ఆర్ఎం కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. వారు శుక్రవారం ఆర్ఎం ఆఫీస్‌లో రిపోర్టు చేసినట్లు సమాచారం. ఇటీవల ఓ ఆర్టీసీ డ్రైవర్ వద్ద హుజూరాబాద్ డిపో మేనేజర్ సామల శ్రీకాంత్ రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డిపోలో విజిలెన్స్ అధికారులు రెండు రోజులపాటు విచారణ చేపట్టారు. డీఎం అక్రమాలకు సహకరించినట్లు తేలిన ఆరుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. డీఎం ఇచ్చిన చార్జీ మెమోలను విజిలెన్స్ అధికారులు కరీంనగర్ ఆర్ఎం కార్యాలయానికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

ఇన్‌చార్జి డీఎంగా వెంకటేశ్వర్లు..

హుజూరాబాద్ ఇన్‌చార్జి డీఎంగా హుస్నాబాద్ డీఎం వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత



నగదు చూపుతున్న కరీంనగర్ పోలీసులు



వేములవాడలో..

వేములవాడ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు భారీ మొత్తంలో నగదు పట్టుకున్నారు. వేములవాడ పట్టణ పరిధిలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం శుక్రవారం ఓ వ్యక్తి వద్ద రూ.5.67 లక్షలు పట్టుకుంది. వ్యాపార లావాదేవీల్లో భాగంగా బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్తున్నట్లు అతను తెలిపాడన్నారు. కానీ, సంబంధిత ఆధారాలు చూపించకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అందజేశామన్నారు. ఏఈఈ వెంకటరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ భిక్షపతి, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులున్నారు.

కరీంనగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కరీంనగర్ నగరంలోని వివిధ ఠాణాల పరిధిలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.15.82 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. బడింది. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్ వన్ టౌన్ పరిధిలోని రాజీవ్ చౌక్‌లో కరీంనగర్ దుర్గమ్మగడ్డకు చెందిన జనగం సుమన్ కల్యాణ్ వద్ద రూ.7 లక్షలు, కరీంనగర్ టూ టౌన్ పరిధిలోని గీతాభవన్ చౌరస్తా వద్ద మానకొండూర్‌కు చెందిన నెల్లి భాస్కర్ వద్ద రూ.1,11,900, ఐబీ చౌరస్తా వద్ద కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన కోల ప్రదీప్‌కుమార్ వద్ద రూ.5,70,900, కరీంనగర్ త్రీ టౌన్ పరిధిలో కట్టారాంపూర్‌కు చెందిన గాండ్ల సురేశ్ వద్ద రూ.2 లక్షలు స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు.

అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద రూ.93 వేలు..

మెట్‌పల్లిరూరల్: బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలోని అంతర్‌జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ కారులో తరలిస్తున్న రూ.93 వేలను పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. సంబంధిత ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి, జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించామన్నారు.

రాయపట్నం చెక్‌పోస్టు వద్ద రూ.2 లక్షలు..

ధర్మపురి: రాయపట్నం చెక్‌పోస్టు వద్ద రూ.2 లక్షలు పట్టుకున్నట్లు ధర్మపురి పోలీసులు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాయపట్నం వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ సమయంలో ఓ వ్యక్తి ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం డబ్బులను సంబంధిత అధికారులకు పంపించినట్లు తెలిపారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.